
NEELAGIRI VARTHA TELUGU DAILY

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త

APTEL/2009/31957 తెలుగు దినపత్రిక

తెలంగాణ ఎడిటర్ : గుంటోజి విష్ణుమూర్తి, శుక్రవారం 11-10-2024 సంపుటి : 15 సంచిక : 104, పేజీలు 13 వెల : 4/-




3 లో..

## 15న హ్యుందాయ్ ఐపిఒ



3 లో..


## జాగిల్ అడిషనల్ డైరెక్టర్‌గా విరాట్ దివాంజి

# జన జీవనంలో టాటా!

ఇక్కడ అంకురించి , ఎక్కడో ఎదిగి.. ఇక్కడే మహా వృక్షంగా సేవలందించారు. భరత జాతికి ఆజన్మాంతం అంకితమయ్యారు. బ్రిటీష్ కాలంలో 28 డిసెంబర్ 1937న, బొంబాయిలో ఒక పార్సీ జొరాష్ట్రియన్ కుటుంబంలో రతన్ టాటా జన్మించారు. అతను నావల్ టాటా, సూని టాటా తనయుడు. 1948లో, టాటాకు 10 వయస్సులో అతని తల్లిదండ్రులు విడిపోయారు. ఈ స్థితిలో రతన్ టాటాను నాయనమ్మ నవాజ్ బాయి పెంచారు. టాటా 8వ తరగతి వరకు ముంబైలోని క్యాంపియన్ స్కూల్‌లో చదివారు. అతను ముంబైలోని కేథడ్రల్, జాన్ కానన్ స్కూల్, సిమ్లాలోని బిషప్ కాటన్ స్కూల్, న్యూయార్క్ నగరంలోని రివర్ డేల్ కంట్రీ స్కూల్‌లో తన చదువును కొనసాగించారు. 1955లో పట్టభద్రుడయ్యారు. టాటా కార్నెల్ విశ్వవిద్యాలయంలో చేరాడు, దాని నుంచ అతను 1959లో ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీని పొందారు. కార్నెల్‌లో ఉన్నప్పుడు, టాటా ఆల్ఫా సిగ్మా ఫై ఫ్రాటెర్నిటీలో సభ్యుడయ్యాడు. 2008లో, టాటా కార్నెల్‌కు ఈ సంస్థ 50 మిలియన్ డాలర్ల బహుమతిగా ఇచ్చింది, విశ్వవిద్యాలయ చరిత్రలో అతిపెద్ద అంతర్జాతీయ దాతగా అవతరించింది.

- ప్రతి ఇంట్లోనూ నిలిచి'పోయారు'
- మానవత్వపు ధీరుడు
- భారత పారిశ్రామిక శిఖరం
- వ్యక్తిగతం కంటే.. దేశమే ప్రధానం
- వాణిజ్య మానవత్వమే అతని నైజం
- సేవలకు వీడ్కోలు చెప్పిన రతన్ టాటా
- అంచెంచల అద్వితీయ శక్తి
- అయినా.. సాదా సీదా జీవనమే

వివరాలు 2లో..



## పన్నుల వాటాను విడుదల చేసిన కేంద్రం

మొత్తం రూ.1,78,173 కోట్లు నిధులు



విడుదల

తెలంగాణకు రూ.3,745 కోట్లు..

ఏపీకి రూ.7,211 కోట్లు నిధుల పంపిణీ

ఢిల్లీ: నీలగిరి వార్త ప్రతినిధి

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు రావాల్సిన వాటాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తంగా రూ.1,78,173 కోట్లు పన్ను వాటాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ముందస్తు వాటాగా రూ. 89,086.50 కోట్లతో కలిపి రూ.1,78,173 కోట్లు విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు రూ.3,745 కోట్లు, ఆంధ్రప్రదేశ్కు రూ.7,211 కోట్లు విడుదల చేసింది.



## రేవంత్‌కు బిసి నేతల థ్యాంక్స్

హైదరాబాద్, నీలగిరి వార్త ప్రతినిధి

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం నేతలు నేడు ఉదయం కలిశారు. తెలంగాణలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను తక్ష ణమే ప్రారంభించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేసారు బీసీ సంక్షేమ సంఘం నేతలు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీహరి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, మరికొంతమంది బీసీ సంక్షేమ సంఘం నేతలు హాజరయ్యారు.



## రతన్ టాటాకు ఎపి క్యాబినెట్ నివాళి

అమరావతి: నీలగిరి వార్త ప్రతినిధి



దిగ్గజ వ్యాపార వేత్త రతన్ టాటా మృతికి ఎపి క్యాబినెట్ సంతాపం తెలిపింది. రతన్ టాటా దేశానికి చేసిన సేవలను సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రస్తావించారు. విలువలతో కూడిన వ్యాపారంతో రతన్ టాటా ఒక పెద్ద బ్రాండ్ ను సృష్టించారని ముఖ్యమంత్రి కొనియాడారు. సంపదను సృష్టించడమే కాకుండా ఆ సంపదను సమాజంలో అన్ని వర్గాలకు చేరేలా పద్మవిభూషన్ రతన్ టాటా ఎంతో కృషి చేశారని అన్నారు. రతన్ టాటా మృతి పారిశ్రామిక రంగానికే కాకుండా దేశానికే తీరనిలోటని ముఖ్యమంత్రి వ్యాఖ్యానిం చారు. రతన్ టాటా మృతికి సంతాపంగా క్యాబినెట్ రెండు నిముషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించింది. రతన్ టాటా చిత్రపటానికి పూలు వేసి ముఖ్యమంత్రి, మంత్రులు నివాళులు అర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ముంబై బయలుదేరి వెళ్లారు.

## మంత్రి కొండా సురేఖకు కోర్టు నోటీస్

- నాగార్జున వేసిన పరువు
- నష్టం పిటిషన్ పై విచారణ
- నేడు రెండో సాక్షి స్టేట్ మెంట్ రికార్డ్
- వ్యాఖ్యలపై వివరణ కోరుతూ మంత్రికి నోటీస్
- విచారణ ఈ నెల 23కి వాయిదా .

హైదరాబాద్ : నీలగిరి వార్త ప్రతినిది

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు నాంపల్లి ప్రత్యేక కోర్టు నోటీసులు జారీ చేసింది. టాలీవుడ్ హీరో నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కొండా సురేఖకు నోటీసులు జారీ చేసినట్లు కోర్టు పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 23వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. నాగార్జున దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా . ఇవాళ రెండో సాక్షి వెంకటేశ్వరరావు స్టేట్‌మెంట్‌ను కోర్టు రికార్డు చేసింది. ఇప్పటికే నాగార్జున, మొదటి సాక్షి సుప్రియ స్టేట్‌మెంట్‌ను ఈ నెల ఎనిమిదో తేదిన కోర్టు రికార్డు చేసింది.

## రతన్ టాటా మృతి యావత్ దేశానికి తీరని లోటు : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : నీలగిరి వార్త ప్రతినిది



ప్రముఖ పారిశ్రామిక వేత్త, గొప్ప మానవతావాది రతన్ టాటా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ రోజు దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందన్నారు. వారి నిష్క్రమణ పారిశ్రామిక రంగానికే కాకుండా యావత్ దేశానికి తీరని లోటు అని అన్నారు. రతన్ టాటా వ్యాపార రంగంలో నిబద్ధతకు, విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తిగానే కాకుండా దాతృత్వానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆయన ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.

## బీజేపీ ఆఫీసుకు మల్లారెడ్డి..

హైదరాబాద్, నీలగిరి వార్త ప్రతినిది

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి బీజేపీ ఆఫీసుకు వెళ్లారు. అక్కడ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. కాసేపు ఆయనతో ముచ్చటించారు. అనంతరం అక్కడి నుంచి తిరుగుపయనమయ్యారు. మరి మల్లారెడ్డి బీజేపీ ఆఫీసుకు ఎందుకెళ్లారు? ఏం పని మీద వెళ్లారు? కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని బీజేపీ ఆఫీసులోనే ఎందుకు కలిశారు? అసలేం జరుగుతోంది? ఇవన్ని ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే ఈ వార్త మొత్తం చదవాల్సిందే. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి.. ఇప్పుడు బీజేపీ ఆఫీసుకు వెళ్లారు. అక్కడ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. తన మనుమరాలు వివాహానికి రావాల్సిందిగా కిషన్ రెడ్డిని ఆహ్వానించేందుకు ఆయన పార్టీ కార్యాలయం వద్దకు వెళ్లారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీజేపీ ఆఫీసులో అందుబాటులో ఉండటంతో.. మల్లారెడ్డి నేరుగా పార్టీ ఆఫీసుకు వచ్చారు. మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి ఇద్దరు కిషన్ రెడ్డిని కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.



# జన జీవనంలో టాటా!

న్యూఢిల్లీ: నీలగిరి వార్త ప్రతినిధి

ఇక్కడ అంకురించి , ఎక్కడో ఎదిగి.. ఇక్కడే మహా వృక్షంగా సేవలందించారు. భరత జాతికి ఆజన్మాంతం అంకితమయ్యారు. బ్రిటీష్ కాలంలో 28 డిసెంబర్ 1937న, బొంబాయిలో ఒక పార్సీ జొరాస్ట్రియన్ కుటుంబంలో రతన్ టాటా జన్మించారు. అతను నావల్ టాటా, సూని టాటా తనయుడు. 1948లో, టాటాకు 10 వయస్సులో అతని తల్లిదండ్రులు విడిపోయారు. ఈ స్థితిలో రతన్ టాటాను నాయనమ్మ నవాజ్ బాయి పెంచారు. టాటా 8వ తరగతి వరకు ముంబైలోని క్యాంపియన్ స్కూల్‌లో చదివారు. అతను ముంబైలోని కేథడ్రల్, జాన్ కానన్ స్కూల్, సిమ్లాలోని బిషప్ కాటన్ స్కూల్, న్యూయార్క్ నగరంలోని రివర్ డేల్ కంట్రీ స్కూల్‌లో తన చదువును కొనసాగించారు. 1955లో పట్టభద్రుడయ్యారు. టాటా కార్నెల్ విశ్వవిద్యాలయంలో చేరాడు, దాని నుంచ అతను 1959లో ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీని పొందారు. కార్నెల్‌లో ఉన్నప్పుడు, టాటా ఆల్ఫా సిగ్మా ఫై ఫ్రాటెర్నిటీలో సభ్యుడయ్యాడు. 2008లో, టాటా కార్నెల్‌కు ఈ సంస్థ 50 మిలియన్ డాలర్ల బహుమతిగా ఇచ్చింది, విశ్వవిద్యాలయ చరిత్రలో అతిపెద్ద అంతర్జాతీయ దాతగా అవతరించింది.

## అంచెలంచెలుగా.. అద్వితీయ శక్తిగా

భారతదేశ పారిశ్రామికవేత్త, దాత, టాటా సన్స్ కు పూర్వపు ఛైర్మన్. అతను 1990 నుంచి 2012 వరకు టాటా గ్రూపునకు ఛైర్మన్ గా ఉన్నారు. తరువాత అక్టోబరు 2016 నుంచి ఫిబ్రవరి 2017 వరకు టాటా గ్రూపునకు ఇంటెరిమ్ ఛైర్మన్ గా ఉన్నారు. టాటా ఛారిటబుల్ ట్రస్టులకు అధిపతిగా కొనసాగారు, భారతదేశ అత్యున్నత పౌర పురస్కారాలు పద్మవిభూషణ్ (2008), పద్మభూషణ్ (2000) లను అందుకున్నారు.%ళి5రి% అతను వ్యాపారంలో విలువలు, దాతృత్వానికి గుర్తింపు పొందారు. టాటా గ్రూపు వ్యవస్థాపకుడు జమ్‌షెడ్జీ టాటా కు మునిమనుమడు ఈ రతన్ టాటా . అతను అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా కార్నెల్ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హార్వర్డ్ బిజినెస్ స్కూల్ ల పూర్వ విద్యార్థి.%ళి8రి% అతను 1961లో టాటా స్టీల్ షాప్ ఫ్లోర్‌లో పనిచేసేటప్పుడు తన కంపెనీలో చేరారు, 1991లో జె.ఆర్.డి టాటా పదవీ విరమణ చేసిన తరువాత అతనికి వారసునిగా భాద్యతలు చేపట్టారు. అతను టాటాను ఎక్కువగా భారత –కేంద్రీకృత సమూహం నుంచి ప్రపంచ వ్యాపారంగా మార్చే ప్రయత్నంలో అమెరికన్ టీ కంపెనీ టెట్లీని సంపాదించడానికి టాటా టీ, జాగ్వార్ ల్యాండ్ రోవర్‌ను సొంతం చేసుకోవడానికి టాటా మోటార్స్, టాటా స్టీల్ ఐరోపా (కోరస్)ను సంపాదించడానికి టాటా స్టీల్ ను పొందారు. ఆయన బాధ్యతలు స్వీకరించే నాటికి 10 వేలకోట్ల టర్నోవర్‌గా ఉన్న టాటా గ్రూప్ ఆదాయం, ఆయన పదవీ విరమణ చేసిన 2013 డిసెంబర్ నాటికి 83,500 కోట్ల టర్నోవరకు చేరుకుంది. గుండు సూది నుంచి నానో కారు వరకూ సామాన్యులకు తన ఉత్పత్తులు అందించారు. విమానయానం సదుపాయాన్ని కల్పించారు. విమానం ఎక్కాలంటే.. కోటీశ్వరులకే ఛాన్స్ .. కానీ ఈ రోజు సామాన్యుడు సైతం విమానం ఎక్కి చక్కర్లు కొట్టే స్థితికి తన వ్యాపారాన్ని పెంచారు.

# నానో కారు వెనక సామాజిక ప్రయోజనం

### పేద మధ్యతరగతి ప్రజల అవస్థలకు ప్రతిరూపం

### స్వయంగా ఉద్దేశ్యాలను వెల్లడించిన రతన్ టాటా

ముంబై,నీలగిరి వార్త ప్రతినిధి





ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నానో కారు ఆవిష్కరణ వెనక కూడా టాటా సేవాదృక్పథం దాగి ఉంది. ఒక సందర్భంలో ఆయన తన ఇన్‌స్టా పోస్టులో ఆ కారు తయారీ వెనక ఉన్న ఆలోచనను పంచుకొన్నారు. నానో లాంటి వాహనాలను తయారుచేయాలన్న కోరిక వెనక నాకు ప్రేరణ ఏంటంటే.. చాలా కుటుంబాలు తరచూ తమ పిల్లలతో కలిసి స్కూటర్లపై వెళ్లడాన్ని నేను చూస్తుండేవాడిని. తల్లీతండ్రి మధ్యలో కూర్చున్న పిల్లలు నలిగిపోతున్నారేమో అని నా మనసుకు అనిపించింది. గుంతలుగా ఉండే రోడ్లపైనా వారు అలాగే ప్రయాణించడం చూసి నాకో ఆలోచన తట్టింది. ముందు మేం ద్విచక్ర వాహనాలను ఎలా భద్రంగా మార్చాలనే దానిపై దృష్టిపెట్టాం. ఆ తర్వాత నాలుగు చక్రాలు ఉండి.. కిటికీలు, డోర్లు లేకుండా కేవలం బగ్గీల్లాంటి వాహనాలను రూపొందించాలను కున్నాం. కానీ చివరకు కారునే తయారుచేయాలని నేను నిర్ణయించుకున్నా. 'నానో' ఎప్పటికీ మన ప్రజల కోసమే అని రతన్ టాటా రాసుకొచ్చారు. వీవీఐపీలు, సెలబ్రిటీలు నిత్యం వచ్చే తాజ్‌మహల్ హోటల్ ప్రవేశ ద్వారం వద్ద వీధి శునకం నిద్రిస్తుండటాన్ని కొన్నాళ్ల క్రితం ప్రముఖ హెచ్‌ఆర్ నిపుణురాలు రుబీఖాన్ గమనించారు. నాడు హోటల్ సిబ్బందిని అడగ్గా.. 'ఆ శునకం పుట్టినప్పటి నుంచి అక్కడే పెరిగింది. హోటల్‌లో ఓ భాగమైపోయింది. అక్కడికి వచ్చే ఏ మూగజీవాన్నైనా జాగ్రత్తగా చూసుకోవాలని రతన్‌టాటా నుంచి విస్పష్టమైన ఆదేశాలున్నాయి అని వెల్లడించినట్లు రాసుకొచ్చారు. చాలామంది అతిథులు అసలు దానిని గమనించి ఉండరన్నారు. ఇంత గందరగోళం మధ్య కూడా ఆ ప్రదేశాన్ని అది సొంతదిగా భావించిందని ముచ్చటపడ్డారు. ఈ విషయాన్ని నాడు లింక్డ్‌ఇన్‌లో పంచుకొన్నారు. టాటాల వ్యాపార సామ్రాజ్య రాజధానిగా భావించే బాంబే హౌస్‌లోనే వీధి శునకాలకు ఆయన ప్రత్యేకంగా ఉండేందుకు గదులను ఏర్పాటు చేశారు. ఏదైనా శునకం కష్టాల్లో ఉంటే.. దానిని ఎవరైనా దత్తత తీసుకోవాలని ఆయన తన సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి విజ్ఞప్తి చేస్తుంటారు. కొవిడ్‌ను సాకుగా చూపి కంపెనీలు కష్టకాలంలో ఉద్యోగులను వదిలించుకొనే విధానంపై ఆయన గళం విప్పారు. ఓ ఆంగ్ల పత్రికతో నాడు మాట్లాడుతూ.. ఇది నష్టాలు వస్తున్నందుకు కంపెనీలు చేస్తున్నది కాదు.. వారిని రోడ్డున పడేస్తే కంపెనీల సమస్యలు తీరతాయా అని ప్రశ్నించారు. ఉద్యోగులను తొలగించకుండా సరైన దిశలో ఆలోచించి చర్యలు తీసుకొంటే ఈ కష్టం నుంచి బయటపడొచ్చని పేర్కొన్నారు. కొవిడ్‌తో పోరాడేందుకు ఆయన ఏకంగా రూ.500 కోట్ల నిధులను కేటాయించారు. 26/11 ముంబయి ఉగ్రదాడిలో తాజ్‌మహల్ హోటల్ సిబ్బంది 11 మంది ప్రాణాలు కోల్పోయారు. నాడు స్వయంగా రతన్‌టాటా గాయపడిన, చనిపోయిన వారి కుటుంబాలను సందర్శించి.. వారి పిల్లల చదువు బాధ్యతలను టాటా గ్రూప్ చూసుకొంటుందని భరోసా ఇచ్చారు. చనిపోయిన వారికి మిగిలిన జీవిత కాలంలో ఉద్యోగంలో వచ్చే జీతాన్ని ఆ కుటుబాలకు చెల్లించారు. తాజ్ పబ్లిక్ సర్వీస్ వెల్ఫేర్ గ్రూపును ప్రారంభించారు. రతన్ టాటా తన వద్ద పనిచేసి మానేసిన ఓ ఉద్యోగికి అనారోగ్యంగా ఉందని తెలుసుకొన్నాడు. ఆయనే స్వయంగా ముంబయి నుంచి పుణెకు వెళ్లి ఆ వ్యక్తిని కలిశారు. ఈ విషయం మూడో కంటికి తెలియనీయలేదు. చివరికి లింక్డ్‌ఇన్ పోస్టు ద్వారా వెలుగులోకి వచ్చింది. సాధారణంగా సంపన్నులు, బిజినెస్ టైకూన్లు కార్లలో వెనక సీట్లలో కూర్చొంటారు. కానీ, రతన్‌టాటా మాత్రం డ్రైవర్ పక్కనే కూర్చొని ప్రయాణాలను ఎంజాయ్ చేస్తారు. ఒక్కోసారి డ్రైవర్ లేకపోతే ఆయనే స్టీరింగ్ వీల్‌ను అందుకొంటారు. విమానాల్లో తరచూ ఆయన ఎకానమీ క్లాస్‌లోనే ప్రయాణిస్తుంటారు. ఆయనతో ప్రయాణికులు కలిసి దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో కనిస్తుంటాయి. ఆన్‌లైన్‌లో విద్వేషం వ్యాప్తిపై రతన్ టాటా గతంలోనే గళం విప్పారు. ఈమేరకు ఇన్‌స్టాలో పోస్టు పెట్టి తన ఫాలోవర్లు వర్చ్యువల్ బుల్లియింగ్‌కు పాల్పడొద్దని పేర్కొన్నారు. ఇతరులపై అనవసరంగా తీర్పులు ఇవ్వొద్దని యువతకు సూచించారు.

# హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ నీలగిరి వార్త ప్రతినిధి

సుప్రీంకోర్టు సౌత్ ఇండియా రీజినల్ బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇదే డిమాండ్‌తో దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బుధవారం నల్లకుంటలోని కార్యాలయంలో సుప్రీంకోర్టు న్యాయవాది వినాయక్‌రావు, హైకోర్టు న్యాయవాది భూపాల్‌రాజ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నల్లకుంటలోని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశానికి సుప్రీంకోర్టు న్యాయ వాదులు, మేధావులు, పలువురు ప్రముఖులు హాజరవుతారని ఆయన తెలిపారు.

# రతన్ టాటా మరణంతో దేశమంతా శోకతప్తం

## టాటాతో అనుబంధం మరువలేనిదన్న శంతన్

ముంబై, నీలగిరి వార్త ప్రతినిధి





దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మరణం ప్రతిఒక్కరినీ ఎంతగానో బాధిస్తోంది. ఇక చివరిదశలో టాటాతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తి శంతను నాయుడు. రతన్‌టాటాతో ఆ యువకుడి స్నేహం అందరినీ ఆశ్చర్యపర్చింది. టాటా ట్రస్ట్‌లో పిన్న వయస్కుడైనా జనరల్ మేనేజర్‌గా, టాటాకు అత్యంత విశ్వాసపాత్రుడైన అసిస్టెంట్‌గా వ్యవహరించిన శంతను.. ఈ మరణంపై తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఈమేరకు సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టు పెట్టారు. గుడ్‌బై మై డియర్ లైట్‌హౌస్ అని రాసుకొచ్చారు. మీ నిష్క్రమణతో మన స్నేహంలో శూన్యం మిగిలింది. ఆ లోటును అధిగమించడానికి ఈ జీవితాంతం ప్రయత్నిస్తాను. ఈ ప్రేమ దూరమవడంతో కలుగుతోన్న దుఃఖం పూడ్చలేనిది. గుడ్‌బై మై డియర్ లైట్‌హౌస్' అని ఈ 30 ఏళ్ల శంతను ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే ఇద్దరు కలిసిదిగిన ఒక పాత చిత్రాన్ని షేర్ చేశారు. శంతను 2018 నుంచి రతన్‌టాటాకు అసిస్టెంట్‌గా ఉంటున్నారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. 80ల్లో ఉన్న టాటాకు.. ఈ యువకుడికి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. వీరిద్దరిని కలిపింది వీధి శునకాలపై ఉన్న ప్రేమే. పెద్ద వయస్కులతో స్నేహం వల్ల కలిగే ప్రయోజనాలు, వృద్ధాప్యంలో వారిపై చూపాల్సిన ఆప్యాయత.. రతన్‌జీతో స్నేహం వల్లే తనకు తెలిసిందని శంతను ఓ సందర్భంలో వెల్లడించారు. ఆ ఆలోచనలో నుంచి పుట్టినదే 'గుడ్‌ఫెల్లోస్' అనే అంకుర సంస్థ. పిల్లలకు దూరంగా ఉన్న వయసు మళ్లిన వృద్ధులకు ఆసరాను అందించే లక్ష్యంతో ఇది ఏర్పాటైంది. దీనిలో టాటా పెట్టుబడులు కూడా పెట్టారు. 'గుడ్ ఫెల్లోస్' లాంచింగ్ కార్యక్రమంలో రతన్‌టాటా మాట్లాడుతూ.. 'ఒక తోడుంటే బాగుండు అని కోరుకుంటూ ఒంటరిగా సమయం గడిపేవరకూ.. ఒంటరితనం అంటే ఎలా ఉంటుందో తెలియదు' అని వ్యాఖ్యానించారు. అలాగే వాస్తవంగా వయసు మళ్లేవరకు.. వృద్ధాప్యం గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరన్నారు. ప్రస్తుతం సహజ సత్సాంగత్యాన్ని పొందడం అత్యంత సవాలుగా ఉందని వెల్లడించారు. ఆ సందర్భంగా శంతను ఆలోచనా విధానాన్ని మెచ్చుకున్నారు.

# ఆక్రమణల ఫిర్యాదుపై అధికారుల విచారణ

హైదరాబాద్ నీలగిరి వార్త ప్రతినిధి

జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36 నాలా ఆక్రమణకు గురైందనే ఫిర్యాదుల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు విచారణ చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో కొన్నిచోట్ల నాలా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, మరికొన్ని ప్రాంతాల్లో నాలా కుంచించుకుపోయిందని హైడ్రాకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఇందులో వాస్తవాలు తేల్చి తగిన చర్యలు తీసుకోవాలని హైడ్రా జీహెచ్‌ఎంసీని కోరింది. దీంతో ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు నంబరు 36లో పర్యటించారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ వద్ద నాలా ఆక్రమణకు గురైనట్టు అధికారులు నిర్ధారించారు. అనంతరం నాలా వెడల్పును తగ్గిస్తూ వ్యాపార సముదాయాలు వెలిసినట్టు తేలింది. కొన్ని ప్రాంతాల్లో నాలా కనిపించకుండా పోయినట్టు అధికారులు గుర్తించారు. ఈ అంశాలపై అధికారులు నివేదిక రూపొందించి హైడ్రాకు అందించనున్నారు.

# రతన్‌కు భారత రత్న ఇవ్వాలంటూ విస్తృత డిమాండ్

### అలాంటి ప్రచారాలను స్వయంగా తోసిపుచ్చిన టాటా

ముంబై, నీలగిరి వార్త ప్రతినిధి

ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటాకు 2008లోనే పద్మవిభూషణ్ పురస్కారం దక్కింది. కానీ, దేశం గర్వించే రతన్ టాటాకు 'భారత రత్న' పురస్కారం ఇస్తే బాగుండేదని గతంలో ప్రముఖులతో సహా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున డిమాండ్లూ వచ్చాయి. అయితే, రతన్ టాటా మాత్రం అలాంటివాటిని ఎప్పుడూ ప్రోత్సహించలేదు. సంపన్న కుటుంబంలో పుట్టినా సామాన్య జీవితం గడిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలుడైన రతన్ టాటా ఏనాడూ కుబేరులతో కలిసి కనిపించక పోవడం గమనార్హం. పురస్కారాలు, పదవులు కంటే 'దేశమే ముందు' అనే సిద్ధాంతాన్ని ఆచరించారు. దీంతో 'భారతరత్న' ఇవ్వాలని సోషల్ మీడియాలో జరిగిన ప్రచారాన్ని వెంటనే ఆపేయాలని మూడేళ్ల కిందట ఓ పోస్టులో విజ్ఞప్తి చేశారు. ఆ వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ వైరల్‌గా మారాయి. భారతీయుడిగా పుట్టడమే తాను చేసుకున్న అదృష్టంగా భావిస్తానని.. దేశ అభివృద్ధిలో, సంపద పెరగడంలో తనవంతు సహకారం అందించినందుకు సంతోషంగా ఉందని రతన్ టాటా పేర్కొన్నారు. నాకు భారతరత్న పురస్కారం ఇవ్వాలంటూ సామాజిక మాధ్యమాల్లో కొన్ని వర్గాలు వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను గౌరవిస్తున్నాను. అయితే దయచేసి అలాంటి ప్రచారాన్ని ఆపేయాలని నేను వాళ్లను కోరుతున్నా' అని గతంలో ఎక్స్‌లో ఆయన పేర్కొన్నారు. దేశానికి రతన్ టాటా అందించిన సేవలను ప్రశంసిస్తూ, యువతకు ఆదర్శంగా నిలిచారని చెబుతూ 'భారతరత్న ఫర్ రతన్ టాటా' హ్యాష్‌ట్యాగ్ విపరీతంగా ట్రెండ్ అవడంతో.. ఆ ట్వీట్లకు స్పందిస్తూ రతన్ పైవిధంగా విజ్ఞప్తి చేశారు. ఏదైనా విజయం సాధించాలంటే యువత తమ శక్తిసామర్థ్యాలను బలంగా విశ్వసించాలని ఓ నెటిజన్ ట్వీట్‌కు రతన్ టాటా బదులిచ్చారు.

# రతన్ టాటా మంచి పైలెట్

### 69 ఏళ్ల వయసులో ఫైటర్ జెట్ నడిపి రికార్డు

ముంబై, నీలగిరి వార్త ప్రతినిధి

రతన్ టాటాకు స్పీడ్ కార్లంటే చాలా ఇష్టం. అందుకే ఆయన కంపెనీ నాణ్యమైన కార్లను ఉత్పత్తి చేసింది. సామాన్యుల కలల కారు నానో వచ్చింది. టాటా స్వయంగా పైలెట్ కూడా కావడంతో విమానాలు నడపాలన్న ఆసక్తితో పాటు..విమనరంగంలో టాటాలను దిగేలా చేసింది. ఆయన పేరిట అరుదైన రికార్డు ఉంది. ఆయన 69 ఏళ్ల వయసులో ఫైటర్ జెట్‌ను నడిపి సంచలనం సృష్టించారు. అమెరికా ఆయుధ తయారీ సంస్థ ఆయన్ను స్వయంగా ఎఫ్–16 నడపడానికి ఆహ్వానించింది. ఆయనకు జెట్ విమానాలు, హెలికాప్టర్లు నడిపేందుకు లైసెన్స్ కూడా ఉంది. 2007లో బెంగళూరులో ఏరో ఇండియా షో జరిగింది. దీనిలో లాక్‌హిడ్ మార్టిన్ కూడా తమ ఫైటర్‌జెట్లను ప్రదర్శించింది. నాడు ఆ సంస్థ టాటాను ఆ౼ర్‌టైర్ విమానం నడిపేందుకు ఆహ్వానించింది. ఈ అవకాశాన్ని టాటా సంతోషంగా అందుకొన్నారు. ఈ ప్రయాణంలో ఆయన కోపైలట్‌గా వ్యహరించారు. దాదాపు అరగంటపాటు సాగిన ఈ అడ్వెంచర్‌లో లాక్‌హిడ్ పైలట్ విమానం కొద్దిదూరం నడిపి.. కంట్రోల్ టాటాకు అప్పగించారు. ఈ సమయంలో పైలట్ సాయంతో కొన్ని విన్యాసాలు కూడా చేశారు. వాస్తవానికి ఓ సందర్భంలో వీరి విమానం భూమికి కేవలం 500 అడుగుల ఎత్తులో 600 నాట్స్ వేగంతో దూసుకుపోయింది. ఆయనకు ఓ రెప్లికాను కూడా లాక్‌హిడ్ గిఫ్ట్‌గా ఇచ్చింది. ఆ మర్నాడే ఆయన బోయింగ్ సంస్థకు చెందిన ఎఫ్–18 సూపర్ హార్నెట్ విమానాన్ని నడపడం విశేషం. దాదాపు 69 ఏళ్ల తర్వాత విమానయాన సంస్థ ఎయిరిండియా తిరిగి రతన్ టాటా హయాంలోనే మాతృ సంస్థకు చేరుకొన్న విషయం తెలిసిందే. ఈ సంస్థ టాటా గ్రూప్‌నకు బదిలీ అయిన తర్వాత టాటా సన్స్ గౌరవ ఛైర్మన్, టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ రతన్ టాటా తొలిసారిగా స్పందించారు. ఎయిరిండియా ప్రయాణికులకు సాదర స్వాగతమంటూ ప్రత్యేక ఆడియో మెసేజ్ పంపారు. రతన్‌కు వైమానిక రంగంపై ఉన్న ఆసక్తిని ఇది తెలియజేస్తోంది.

# రాష్ట్ర ప్రజలకు కేటీఆర్ బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్ నీలగిరి వార్త ప్రతినిధి

తెలంగాణలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఎనిమిది రోజుల పాటు ఒక్కో పేరుతో బతుకమ్మను పేర్చి ఆడిపాడిన ఆడపడుచులు ఈరోజు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈరోజుతో తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ముగియనున్నాయి. సద్దుల బతుకమ్మ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. తొలిరోజు ఎంగిపూల బతుకమ్మను పురస్కరించుకుని తెలంగాణ ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్.. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎక్స్ వేదికగా విషెష్ తెలిపారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక మన బతుకమ్మ పండుగని కేటీఆర్ అన్నారు. పూలను, ప్రకృతిని దేవుళ్లుగా కొలుస్తూ ఆడ బిడ్డలు ఆనందంగా జరుపుకునే అద్భుమైన పండుగన్నారు. దేశంలోనే ఎక్కడ లేని అరుదైన, అందమైన సంస్కృతి వారసత్వం మన బతుకమ్మ పండగ అని గుర్తుచేసుకున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా ఆడ బిడ్డలంతా ఎంతో సంతోషంగా ఈ ఘనమైన పండుగను జరుపుకుంటారన్నారు. ఆడబిడ్డల జీవితాల్లో బతుకమ్మ తల్లి మరిన్ని సంతోషాలు, వెలుగు నింపాలని కోరుకుంటున్నాని తెలుపుతూ ఆడబిడ్డలందరికీ కేటీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ ముస్తాబు...

మరోవైపు బతుకమ్మ సంబరాలకు తెలంగాణ రాష్ట్రం ముస్తాబైంది. పల్లెల్లో, పట్టణాల్లో మహిళలు బతుకమ్మ సంబరాలు జరుపుకునేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇటు హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద బతుకమ్మ సంబరాల కోసం అంతా సిద్ధం చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు అక్కడకు చేరుకుని బతుకమ్మ వేడుకల్లో పాలుపంచుకోనున్నారు. ఈ క్రమంలో ట్యాంక్ బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలకు భారీ ఏర్పాట్లు జరిగాయి. ఈ వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. సాయంత్రం ట్యాంక్ బండ్‌పై లేజర్, క్రాకర్స్ షోను నిర్వహించనున్నారు.

# జగిత్యాల జిల్లాలో విషాదం

జగిత్యాల జగిత్యాల జిల్లాలో పండుగుపూట విషాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు ఢీ కొని హెూంగార్డు మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన మెట్‌పల్లి పట్టణ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెట్‌పల్లి పట్టణానికి చెందిన హెూంగార్డు సుబ్బరాజు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, సుబ్బరాజు ఓ హెూటల్‌లో టిఫిన్ తీసుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా నిజామాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు సుబ్బరాజు బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో హెూంగార్డు అక్కడికక్కడే మృతి చెందాడు.

# చెట్టును ఢీకొట్టిన కారు

### భారీగా ఎగిసిపడిన మంటలు

నారాయణపేట నీలగిరి వార్త ప్రతినిధి

కారు చెట్టును ఢీకొట్టగా భారీగా మంటలు ఎగిసిపడ్డ సంఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలోని రోడ్డు క్యాంపు సమీపంలో గురువారం ఉదయం నాలుగు గంటల సమయంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నుంచి మంత్రాలయంకు బయలుదేరిన కారు మాగనూరు మండల కేంద్రంలోని రోడ్డు క్యాంపు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి చెట్టును ఢీకొట్టడంతో కారులో వేగంగా మంటలు వ్యాప్తి చెందాయి. అదృష్టవశాత్తు కార్ డోర్లు సకాలంలో ఓపెన్ కావడంతో అందులో పయనిస్తున్న కుటుంబ సభ్యులు బయట పడి ప్రాణాలు దక్కించుకున్నారు.

NEELAGIRI VARTHA TELUGU DAILY
నీలగిరి వార్త
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# మెరీనా విషాదం

చెన్నైలోని మెరీనా బీచ్‌లో భారత వైమానిక దళం నిర్వహించిన ఎయిర్‌షోలో ఐదుగురు సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వైమానిక దళపు 92వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ఆరవ తేదీన నిర్వహించిన కార్యక్రమంలో ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌షోకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించడంతో లక్షలాది మంది ప్రజలు తరలి వచ్చారు. దాదాపుగా 15 లక్షల మంది ఈ



కార్యక్రమానికి హాజరై ఉంటారని అంచనా! ఇంత భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చేటప్పుడు ఎన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలో, ఎంత అప్రమత్తంగా ఉండాలో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆ తరహా చర్యలన్నీ తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం చెబుతోంది. అయితే, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎక్కడో ఒక చోట, ఏదో ఒక లోపం బయటపడుతూనే ఉంటుంది! ముఖ్యంగా ప్రకృతి నుండి అనూహ్యంగా వచ్చే సవాళ్లను ఎదుర్కోవడం అంత సులభం కాదు. ఎయిర్ షో జరిగిన రోజు కూడా అటువంటి పరిస్థితే. 34 నుండి 35 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఆ రోజు వాతావరణం వేడెక్కింది. విపరీతంగా వేడి గాలులు వీచాయి. తీవ్రమైన ఎండ ధాటికి తట్టుకోలేక ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 200 మందికి పైగా స్పృహ కోల్పోయారు. 102 మందిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తమకు తల తిరుగుతున్నట్లు ఫిర్యాదులు చేశారు.

వడదెబ్బతోపాటు, డీ హైడ్రేషన్, ఊపిరాడకపోవడం వంటి సమస్యలు కూడా ఈ పరిస్థితికి కారణంగా చెబుతున్నారు.అయితే, ఈ స్థాయి ఉష్ణతాపం గురించి ముందుగా హెచ్చరికలు లేవా అంటే ఉన్నాయి. ఇండియన్ ఎయిర్‌ఫోర్సు ఈ స్థాయి ఉష్ణోగ్రతలుంటే ఏం చర్యలు తీసుకోవాలో వివరిస్తూ కొన్ని సలహాలు, సూచనలు చేసింది. అయితే, నిర్దిష్టంగా ఎటువంటి హెచ్చరికలు లేవని అంటున్నారు. పైగా చెన్నై నగరానికి ఆ స్థాయి ఉష్ణోగ్రతలు కొత్త కూడా కాదు. దీంతో తాగునీరు ఏర్పాటు వంటి చర్యలను తీసుకున్నారు. అయితే, ఎయిర్ షో సజావుగా సాగిన తరువాత కార్యక్రమం ముగింపు సమయంలో ఒక్కసారిగా ఈ విపత్తు ముంచుకొచ్చింది. అందరూ ఒక్కసారిగా తిరిగి వెళ్లడానికి ప్రయత్నించడంతో ఏర్పడిన తీవ్రమైన ఉక్కపోత పరిస్థితులకు తోడు అధిక ఉష్ణోగ్రత ప్రజానీకంపై ప్రభావం చూపింది. మెరీనా బీచ్ లోపలికి వెళ్లడానికి అనుమతించిన గేట్లను మూసివేశారు. వెళ్లడానికి ఉద్దేశించిన గేట్ల నుండే బయటకు పంపడానికి చాలాసేపు ప్రయత్నించినట్లు చెబుతున్నారు. పరిస్థితి చేయి దాటిన తరువాత ఆ గేట్లను కూడా తెరిచినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీనికి తోడు మెట్రో, మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ వంటి రవాణా వ్యవస్థలు విఫలమైనాయి. రోడ్లు కిక్కిరిసి పోవడంతో బాధితులను ఆస్పత్రులకు తరలించడమే కష్టంగా మారింది. మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారాన్ని ప్రకటించిన తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ వివిధ శాఖలు సమన్వయంతో పని చేసినా, ప్రజలు అంచనాకు మించి తరలిరావడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడిందని అన్నారు.ఈ స్థాయి కార్యక్రమాలు నిర్వహించడం చెన్నైకి కొత్తేమీ కాదు. 2003 సెప్టెంబర్ ఆరున నిర్వహించిన భారత వైమానిక దళ ప్రదర్శనను వీక్షించడానికి 13 లక్షల మంది తరలివచ్చినట్లు అధికారిక సమాచారం. దానితో పోల్చుకుంటే ఈ ఏడాది అదనంగా వచ్చింది రెండు లక్షల మంది మాత్రమే! అప్పట్లో పిల్లలు తప్పిపోవడం వంటి సంఘటనలు మినహా ఈ తరహా మరణాలు లేవు. అప్పట్లో కూడా ట్రాఫిక్ రద్దీ కారణంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి.

NEELAGIRI VARTHA TELUGU DAILY
నీలగిరి వార్త
తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# ఒక్క పూటలోనే ఆనందం ఆవిరి



## సెన్సెక్స్ 167 పాయింట్ల పతనం

**ముంబయి :**

వరుస నష్టాల నుంచి ఉపశమనం లభించిందని భావించిన ఇన్వెస్టర్ల ఆనందం ఒక్క పూటలోనే ఆవిరయ్యింది. ఆరు సెషన్లలో భారీ నష్టాలను చవి చూసిన మార్కెట్లు.. మంగళవారం రాణించగా.. బుధవారం తిరిగి ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ భయాలకు తోడు ఆర్‌బిఐ కూడా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించడం ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. మార్కెట్లు ఉదయం లాభాల్లోనే సాగినప్పటికీ.. చివరి గంటలో అమ్మకాలు ఊపందుకున్నాయి. దీంతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 167 పాయింట్లు కోల్పోయి 81,467కు పరిమితమయ్యింది. ఇంట్రాడేలో 82,319 గరిష్టాన్ని తాకిన సూచీ.. మరో దశలో 250 పాయింట్లు పైగా నష్టపోయింది. నిఫ్టీ 31 పాయింట్ల నష్టంతో 24,981 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో ఐటిసి, నెస్లే ఇండియా, రిలయన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్అండ్‌టి షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉండగా.. టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. రిలయన్స్ ఇండిస్టీస్ 1.65 శాతం నష్టపోయింది. నిఫ్టీ 50లో 31 స్టాక్స్ రాణించాయి. బాంకింగ్, ఎఫ్ఎంసిజి రంగాలు నష్టాలను చవి చూశాయి. రియాల్టీ 2.15 శాతం, ఫార్మా 2.04 శాతం, ఆటోమొబైల్ 0.82 శాతం చొప్పున రాణించాయి.

# లాభాల్లో సూచీలు .. సెన్సెక్స్ తిరిగి రూ.82,000 మార్క్‌కి

**ముంబయి :**

సెన్సెక్స్ బుధవారం తిరిగి రూ. 82,000 మార్క్‌ను దాటింది. రెపో రేట్లు యథాతథంగా ఉంచాలన్న రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ప్రకటనతో పాటు బ్యాంకింగ్, ఐటి షేర్ల కొనుగోళ్లు మార్కెట్లలో సానుకూల ధోరణికి తోడయ్యాయని ట్రేడర్లు తెలిపారు. ప్రారంభ ట్రేడ్‌లో సెన్సెక్స్ 556.97 పాయింట్లు దాటి రూ.82,191కి చేరుకోగా, నిఫ్టీ 78.70 పాయింట్లు పెరిగి రూ.25,091కి చేరింది.సెన్సెక్స్ కంపెనీలైన ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫినాన్స్, టాటా మోటార్స్, భారతి ఎయిర్‌టెల్, పవర్ గ్రిడ్ మరియు హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ భారీ లాభాలను సాధించాయి. నెస్టె ఇండియా, ఐటిసి, హెచ్‌యుఎల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, మహీంద్ర అండ్ మహీంద్ర నష్టాల్లో నిలిచాయి.వరుసగా పదోసారి వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బిఐ బుధవారం నిర్ణయించింది.



# ఆల్‌కార్గో గతి ధరల పెంపు

**ముంబయి :**

ఉత్పత్తులు, సరుకు రవాణ సప్లయి చెయిన్ మేనేజ్‌మెంట్ సంస్థ ఆల్‌కార్గో గతి లిమిటెడ్ (ఇంతక్రితం గతి) తన ఎక్స్‌ప్రెస్ డిస్ట్రిబ్యూషన్ సేవల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలు 2025 జనవరి 1వ తేది నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. సగటు సాధారణ ధర పెరుగుదల (జిపిఐ) 10.2 శాతంగా ఉంటుందని వెల్లడించింది. గతిని 2019లో ఆల్‌కార్గో లాజిస్టిక్స్ కొనుగోలు చేసిన తర్వాత చేస్తున్న మొదటి ధరల సవరణ అని పేర్కొంది. ద్రవ్యోల్బణం, నియంత్రణ, భద్రతా చర్యలకు సంబంధించిన పరిపాలనా వ్యయాలను పరిగణనలోకి తీసుకుని పెంపును చేపట్టినట్లు ఆ కంపెనీ డిప్యూటీ ఎండి కేతన్ కులకర్ణి తెలిపారు.

# 15న హ్యుందాయ్ ఐపిఒ

## ధరల శ్రేణీ రూ.1865-1960

**న్యూఢిల్లీ :**

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) అక్టోబర్ 15న ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. ఒక్కో షేర్ ధరల శ్రేణీని రూ.1865-1960గా నిర్ణయించింది. దీంతో గరిష్టంగా రూ.27,870 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఇష్యూ 17న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఒక రోజు ముందుగానే అంటే 14న సబ్‌స్క్రిప్షన్ తెరువనుంది. ఈ ఇష్యూలో 14,21,94,700 ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక్క లాట్‌లో రూ.13,720 పెట్టుబడితో 13 షేర్లకు బిడ్ వేయాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 14 లాట్లు కొనుగోలు చేయడానికి వీలుంది. దేశంలో ఇప్పటి వరకు అతిపెద్ద ఐపిఒగా ఉన్న ఎల్ఐసి కంటే హ్యుందారు ఇష్యూ పెద్దది.




# జాగిల్ అడిషనల్ డైరెక్టర్‌గా విరాట్ దివాంజి



**న్యూఢిల్లీ :**

ఫిన్‌టెక్ సేవల సంస్థ జాగిల్ తమ అడిషనల్ డైరెక్టర్‌గా విరాట్ దివాంజీని బోర్డులోకి తీసుకున్నట్లు ప్రకటించింది. విరాట్ బ్యాంకింగ్ రంగంలో 30 ఏళ్ల అనుభవం కలిగి ఉన్నారు, రిటైల్ బ్యాంకింగ్ సహా కొటాక్ గ్రూపులో ఏకంగా మూడు దశాబ్దాల పాటు పలు హోదాల్లో పని చేశారు. తమ వినియోగదారులకు మరిన్ని వినూత్న సేవలు అందించడానికి విరాట్ నియామకం మరింత దోహదం చేయనుందని జాగిల్ విశ్వాసం వ్యక్తం చేసింది.

# ఏలూరుకు విస్తరించిన జెఎం ఫైనాన్సియల్

**బిజినెస్ బ్యూరో :**

విత్త సేవల సంస్థ జెఎం ఫైనాన్సియల్ ఏలూరుకు విస్తరించింది. ఇక్కడి పవర్‌పేట్ ప్రాంతంలో తన కొత్త శాఖను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో 10 శాఖలకు పెంచుకున్నట్లు పేర్కొంది. దేశంలో ఇది తమకు 121వ శాఖ అని తెలిపింది. ఈ వ్యూహాత్మక విస్తరణ దక్షిణాదిలో కంపెనీ కార్యకలాపాలను మరింత బలపరుస్తుందని జెఎం ఫైనాన్సియల్ హోంయ లోన్స్ లిమిటెడ్ ఎండి, సిఇఒ మనీష్ సేథ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సరసమైన వడ్డీ రేట్లతో గృహ రుణాల డిమాండ్‌ను తీర్చడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



# "దాతృత్వానికి ప్రతీక రతన్ టాటా" : డీసీసీ అధ్యక్షులు షేక్ సైదా


దేశ పారిశ్రామిక రంగానికి నిజమైన ఐకాన్ రతన్ టాటా : డా"చిలక అనిల్ కుమార్

మెరుగైన సమాజం కోసం రతన్ టాటా కృషి ఎనలేనిది : పాలపర్తి విజేష్ రాజ్

భారత్ దిగ్గజ వ్యాపారవేత్తను కోల్పోయింది : రిహానా భాను

అరుదైన పారిశ్రామికవేత్త రతన్ టాటా అశ్రునివాళి : పోలు మరియమ్మ

బ్యూరో ఇంచార్జీ (కంచర్ల నాగేశ్వరరావు గౌడ్) : నీలగిరి వార్త




రతన్ టాటా మరణం పట్ల గురువారం నాడు ఒంగోలు డిసిసి కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు షేక్ సైదా నేతృత్వంలో "రతన్ టాటా" మృతి పట్ల కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియా వేదికగా పలువురు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా " షేక్ సైదా "మాట్లాడుతూ రతన్ టాటా దూరదృష్టి ఉన్న వ్యాపార వేత్త అని షేక్ సైదా కొనియాడారు. ప్రతిష్టాత్మక వ్యాపార సంస్థలకు స్థిరమైన నాయకత్వం అందించారని,మెరుగైన సమాజం కోసం ఆయన కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు " డాక్టర్ చిలక అనిల్ కుమార్ " మాట్లాడుతూదేశ పారిశ్రామిక రంగానికి నిజమైన ఐకాన్ రతన్ టాటా అని ప్రశంసించారు. సమాజంకోసం,దేశ నిర్మాణానికి రతన్ టాటా అందించిన సహకారం, సేవలు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. తదుపరి సంతనూతలపాడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి " పాలపర్తి విజేష్ రాజ్ " మాట్లాడుతూ వ్యాపారం,దాతృత్వంలో రతన్ టాటా శాశ్వత ముద్ర వేశారని ఆయన ప్రశంసించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా పార్టీ అధ్యక్షురాలు " రిహానా భాను " మాట్లాడుతూభారత్ దిగ్గజ వ్యాపారవేత్తను కోల్పోయిందని, రతన్ టాటా చేసిన సేవలు ప్రపంచంలోని ఎందరికో స్ఫూర్తిదాయకమని ఆమె పేర్కొన్నారు. చివరగా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఎర్రగొండపాలెం నియోజకవర్గ అధ్యక్షురాలు " పోలు మరియమ్మ " మాట్లాడుతూఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామికవేత్త రతన్ టాటా అని ఆమె కొనియాడారు.

# తిరుమలలో బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన స్వామి




**తిరుమల,**

శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సూర్యుడు తేజోనిధి, సకల రోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటి వల్ల పెరిగే చెట్లు, చంద్రుడు, అతని వల్ల పెరిగే సముద్రాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుని దర్శనం వల్ల ఆరోగ్య, విద్య, ఐశ్వర్యం, సంతానం వంటి ఫలాలు భక్తకోటికి సిద్ధిస్తాయని నమ్మకం. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం మలయప్పస్వామి వారు చంద్రప్రభ వాహనంపై విహరించి భక్తకులకు అభయమివ్వనున్నారు. చంద్రుడు శివునికి శిరోభూషణమైతే ఇక్కడ శ్రీహరికి వాహనంగా ఉండడం విశేషం. చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు. చంద్రప్రభ వాహనంపై స్వామిని చూడగానే భక్తుల మనసు ఉప్పొంగుతుంది.



# కబ్జా కోరల్లో అటవీ భూములు...





యథేచ్ఛగా అటవీ భూముల ఆక్రమణ...

పోడు భూముల పట్టాతో అడవులను దున్నేస్తున్న ఆక్రమణదారులు...

కబ్జాలకు పాల్పడుతున్న వైనం...

వన్యప్రాణుల మూగవేదన...

మనిషి స్వార్థానికి అడవులు నాశనం...

ఆహారం,నీళ్ల లేక విలవిల...

జనావాసాల్లోకి జంతువులు...

దాడులు,ప్రమాదాల్లో మృత్యువాత...

జిల్లాలో తరిగిపోతున్న అటవీ సంపద...

రోజురోజుకూ పెరిగిపోతున్న స్మగ్లర్ల ఆగడాలు...

స్మగ్లర్ల దాడులతో తనిఖీల పై వెనుకడుగు...

ఆయుధాలతో గస్తీకాస్తున్న వన్యప్రాణులకు రక్షణ కరువు...

ఇప్పటి వరకు జరిగిన దాడుల పై నామమాత్రపు చర్యలు...

పర్యావరణ పరిరక్షణ ఎండమావేనా..?

బ్యూరో ఇంచార్జీ (కంచర్ల నాగేశ్వరరావుగౌడ్ ): నీలగిరి వార్త

నాగరికత అభివృద్ధికి ఆధునికత తోడ్పడాలి కానీ,వినాశానికి దారి తీయకూడదు. మానవుడు ఆర్థికాభివృద్ధి కోసం ప్రకృతి వనరులను అవసరానికి మించి వాడుకుంటున్నాడు. అడవులను నరికి వేయడం,పరిశ్రమలు నెలకొల్పి కాలుష్యాన్ని మరింత పెంచి గ్రీన్ హౌజ్ వాయువులతో భూగోళాన్ని వేడెక్కించడం వంటి చర్యల ద్వారా పుడమి తల్లికి మానవుడు పెనుప్రమాదంతెస్తున్నాడు. ప్రకాశంజిల్లాలో అటవీ సంపద రోజురోజుకూ తగ్గుముఖం పడుతుంది. అడవులు కబ్జాలకు గురవుతున్న కారణంగా ఇటు పర్యావరణం దెబ్బతినడమే కాకుండా వన్యప్రాణుల జీవనానికి సైతం ముప్పు వాటిల్లుతోంది. తరిగిపోయిన అడవులను మళ్లీ పెంచేందుకే కాకుండా ప్రస్తుతం ఉన్న అడవులను స్మగ్లర్ల బారి నుంచి రక్షించేందుకు సంబంధిత శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆశించినా మేరకు ఫలితాన్నివ్వడం లేదని పలువురు అంటున్నారు. జిల్లాలో అటవీ భూముల ఆక్రమణదారులు,స్మగ్లర్ల గొడ్డలి వేటుకు అడవులు కనుమరుగవుతున్నాయి. భవిష్యత్తు తరాలకు అడవులను మిగిల్చకుండా భూ ఆక్రమణదారులు అడవులను యథేచ్ఛగా కబ్జాలు చేస్తున్నారు. నల్లమల అడవి దక్షిణ భారతదేశంలో అతిపెద్ద అటవీ విస్తీర్ణంలో ఒకటి. ఇది తూర్పు కనుమలలో భాగమైన నల్లమల కొండలో ఉంది. ఇది కర్నూలు, గుంటూరు,కడప,మహబూబ్‌నగర్ మరియు ప్రకాశంజిల్లా అనే 5 జిల్లాల్లో విస్తరించి ఉంది.

ప్రకృతి సౌందర్యానికి నెలవు నల్లమల అడవులు ఎటు చూసినా పచ్చదనం ఈ అడవి సొంతం. ఎన్నో జీవులకు ఆశ్రయ వారధి. నల్లమల్ల అడవులనే నమ్ముకుని జీవనం సాగించే కుటుంబాలు సైతం ఉన్నాయి. ప్రకృతి వరప్రసాదినిగా పేరుగాంచిన నల్లమల్ల అడవులు ప్రస్తుతం పూర్వ శోభను కోల్పోయాయి. ప్రస్తుత పర్యావరణ ప్రపంచం ప్రమాదపు అంచులో ఉంది. మానవాళి ప్రకృతితో ఆడుతున్న చెలగాడటం వల్ల రోజు రోజుకి భూమి పై ఉష్ణతాపం అధికమవుతూ ఉంది. 17వ శతాబ్దం అర్ధభాగం నుండి ఐరోపాలో ఆరంభమ్కైన పారిశ్రామిక విప్లవంతో కర్బన ఉద్గారాల విడుదల విచ్చలవిడిగా జరిగింది. మొదట్లో ఈ ప్రగతి చూసి అందరు ఎంతో గర్వపడ్డారు. అభివృద్ధిలో దూసుకుపోతున్నాం అనుకన్నాం. అత్యున్నత ఆవిష్కరణలను కనిపెడుతున్నామని గర్వపడ్డాం. కానీ మానవ చర్యల కారణంగా కాలుష్యం పెరిగి వాతావరణంలో పెనుమార్పులు సంభవించి మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని గురించలేకపోయాం. కొంత కాలానికి గుర్తించినా సామ్రాజ్యవాద శక్తులు,కార్పొరేట్ శక్తులు తమ లాభాలనే చూసుకుంటున్నాయి తప్పా సర్వసమాన శ్రేయస్సును పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యం పేరుతో ఎన్నికల్లో ఎన్నికవుతున్న ప్రభుత్వాలు కూడా ప్రజాప్రయోజనాల్ని విస్మరించి కార్పొరేట్ల దోపిడీకీ,పర్యావరణ విధ్వంసానికీ తోడ్పడటం విచారకరం. శాస్త్రవేత్తలు చాలా కాలంగా హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోకపోతే విపత్తు తప్పదని పలు నివేదికలు ఘోషిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సమగ్ర నీటి నిర్వహణ విధానాలను చిత్తశుద్ధితో చేపట్టాలి. ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమవుతున్న కర్బన ఉద్గారాలను సమర్థంగా కట్టడి చేయాలి. శిలాజ ఇందనాల వినియోగాన్ని తగ్గించి,పునరుత్పాదక ఇంధనాల వాడకాన్ని ప్రోత్సహించాలి. ప్రకృతి మనకు అనుకూలించాలంటే,ముందు మనం దానికి సహకరించాలి. దాని ముందు తలవంచాలి.

# ప్రకాశంజిల్లాలో ఆర్టీ(ఛీ) బస్టాండ్లు...?

ఆదాయం పైనే ఆశ..సౌకర్యాల కల్పన ఎక్కడ..?

అధ్వాన్నంగా ఆర్టీసీ బస్టాండ్ లు..?

ఆర్ టి సి అత్యవసర కృత్యాలకు ఇక్కట్లు..!

ఆదాయం ఫుల్ ..కనీస వసతులు నిల్ ...?

ఎవరికీ పట్టని ప్రయాణికుల ఇబ్బంది..!

అస్తవ్యస్తంగా మూత్రశాలలు..!

ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్న ఆర్టీసీ క్యాంటీన్లు...

బ్యూరో ఇంచార్జీ (కంచర్ల నాగేశ్వరరావు గౌడ్) : నీలగిరి వార్త



ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు వారికి అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు,మూత్రశాలలు వంటి కనీస సౌకర్యాల కల్పన బాధ్యత యాజమాన్యం పై ఉంది. అయితే ప్రకాశంజిల్లాలోని బస్ స్టాఫ్ లు,బస్టాండ్లలో వసతులు లేక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో ప్రయాణ ప్రాంగణాలు అధ్వానంగా కనిపిస్తున్నాయి. ఒకట్రెండు బస్టాండ్లు మినహా చాలా చోట్ల సమస్యలు నెలకొన్నాయి. రోజురోజుకూ టిక్కెట్ల ధరలు పెంచుతున్నారే తప్ప ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వేసవిలో బస్సుల కోసం ఎదురుచూసే వారికి ఉపశమన ఏర్పాట్లు ఏమీ లేవు.. జిల్లాలో ఒంగోలు,పొదిలి,కనిగిరి,మార్కాపురం వంటి ఆయా మండల కేంద్రాల్లో అయితే బస్టాండ్లు నిరుపయోగంగా మారాయి. దీనికి తోడు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న క్యాంటీన్లో టిఫిన్ల కాఫీ ధరలు బయట వాటి కంటే అధికంగా ఉన్నాయి. ఇక్కడ ఉదయం పూట ఓ రేటు రాత్రి సమయంలో ఓ రేటు అమలు చేస్తున్నారు. ప్రయాణికుల వద్ద దోపిడీ చేస్తున్న,నిబంధనలకు విరుద్ధంగా గృహఉపకరణ సిలిండర్లను ఉపయోగిస్తున్న,సంబంధిత శాఖ అధికారులు కనీసం చూడకపోవడం పర్యవేక్షించకపోవడంతో,ఈ దోపిడీలో సంబంధిత శాఖ అధికారులకు వారి వాటా వెళ్తున్నట్లు ప్రయాణికులు బాహటంగానే చర్చించుకుంటున్నారు. పండగ పూట తమ సొంత ఊర్లకు ఆర్టీసీ ప్రయాణంలో చేయాలంటే ఆర్టీసీ టికెట్ ధరలు పెరగడంతో ప్రయాణ భారం అధికమైందంటే ప్రయాణంలో తినుబండారాల దారి దోపిడీ ఒక ఎత్తయిందని ప్రయాణికులు అసహ్యించుకుంటున్నారు..

**నిలువు దోపిడీ ఇలా..?**

బస్టాండ్లలోని షాపుల్లో వస్తువులు,తినుబండరాలను నిబంధనల ప్రకారం ఎంఆర్‌పీ (మాగ్జిమమ్ రిటైల్ ప్రైస్)కే అమ్మాలి. షాపులు దక్కించుకున్న యాజమానులకు ఇచ్చే అగ్రిమెంట్లలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తారు. అయితే ఈ నిబంధన అమలు కావడం లేదు. రూ.10 ఎంఆర్‌పీ ఉన్న వస్తువును రూ.15కి అమ్ముతున్నారు. తినుబండరాలు,కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్ సైతం ఇదే తరహాలో విక్రయిస్తున్నారు. రూ.20 ఉన్న నీళ్ల బాటిల్‌ను రూ.25కి అమ్ముతున్నారు. దీని పై ప్రశ్నిస్తే 'ఇది బస్టాండ్,మీరు ఏది తీసుకున్న ఎమ్మార్పీ కంటే ఐదు రూపాయలు ఎక్కువ ఉంటుంది. మీకు ఇష్టం ఉంటే తీసుకోండి లేకపోతే లేదు అని ప్రయాణికుల మొహం మీద షాపులో విక్రయదారులు మొహమాటం లేకుండా చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతిని ధులు ఆర్టీసీ అధికారులు చొరవ చూపి బస్టాండ్లో బాత్రూంలతోపాటు మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**అధికారులు పట్టించుకోలేదు...**

అధికారులు పట్టించుకోలేదు. బాత్‌రూంకు వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సి ందే. ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీ కూడా లేదు. త్రాగడాన్నికీ నీరు లేదు...

పోలు. మరియమ్మ,కాంగ్రెస్ పార్టీమహిళా నాయకురాలు

**తాగునీరు ఏర్పాటు చేశాం...**

తాగునీరు ఏర్పాటు చేశాం. మిగతా సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తాం. ప్రయాణికులకు ఏ ఇబ్బందులు కలగనివ్వం....

**.ఆర్టీసీ డీఎం,ఒంగోలు**



Printed, Published and Owned by GUNTOJU VISHNUMURTHY, Printed at V.M PRINTERS Plot.no.108, shivashakar colony, kuntloor (vill) Abdullapurmet(md) Dist. Rangareddy Telangana, Published at V.M PUBLCATIONS Plot.no.108, shivashakar colony, kuntloor (vill) Abdullapurmet(md), Dist.Rangareddy, Telangana state pin : 501505. Editor : GUNTOJU VISHNUMURTHY, RNI NO. APTEL/31957/2009, cell no.9676549223